
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.4 ; కనిష్ఠం 17.7
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 9 జనవరి 2024



ఓపెన్ అడ్మిషన్లకు స్పెషల్ డ్రైవ్

నిజామాబాద్ అర్బన్, జనవరి 8: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2023-24 విద్యాసంవత్సరానికి గాను 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాల కోసం ఈనెల 9 నుంచి 11 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు డీఈవో ఎన్‌వీ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ ప్రవేశాలు పొందే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీఎస్ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల్లో ఫీజు చెల్లించవచ్చన్నారు. ఇతర సందేహాల కోసం ఉమ్మడిజిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ రవీందర్ 8008403518 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.





'పార్లమెంట్'పై ప్రధాన పార్టీల నజర్

- హైదరాబాద్‌లో ఒకేరోజు మూడు పార్టీల పార్లమెంట్ స్థాయి సమావేశం
- సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జిల సమావేశం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో పదాధికారుల సమావేశం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో పార్లమెంట్ సమీక్ష
- సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని నేతలకు దిశా నిర్దేశం

నిజామాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు నజర్ పెట్టారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం నేతలతో సమీక్షించడంతో పాటు ముందస్తుగానే సన్నాహాలను మొదలు పెట్టారు. హైదరాబాద్‌లో ఒకేరోజు మూడు పార్టీల నేతలు పార్లమెంట్ ఎన్నికలపై సమీక్షించారు. శాసనసభ ఎన్నికల ఫలితాలు, వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల బలాబలాలపై చర్చించారు. సమన్వయంతో పార్లమెంట్ ఎన్నికలను ఎదుర్కోవాలని నిర్ణయించారు. త్రిముఖ పోటీ ఉండ నుండటంతో బలమైన అభ్యర్థులను బరిలో దింపేందుకు సిద్ధమవుతున్నట్లు నేతలు వివరించారు. ఎవరిని నిలబెట్టినా గెలుపు కోసం పనిచేయాలని కోరారు. నియోజకవర్గ స్థాయి నేతలతో దిశా నిర్దేశం చేయడంతో పాటు మండల స్థాయి నేతలతో కలిసి ఇప్పటి నుంచే పార్లమెంట్ పరిధిలో కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.

మూడు పార్టీల నేతల సమీక్ష

వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు సన్నద్ధమవుతున్నారు. ఒకేరోజు నిజామాబాద్ పార్లమెంట్‌పై హైదరాబాద్‌లో మూడు పార్టీల నేతలు సమీక్షించారు. వాస్తవ పరిస్థితి నేతలకు వివరించడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో స్థానాలను గెలుచుకునేందుకు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల నేతల సమావేశాన్ని మర్రిచిన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ పదాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలపై చర్చించడంతో పాటు పలు పార్లమెంట్‌లకు ఎమ్మెల్యేలను ఇన్‌చార్జిలుగా నియమించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికలపై సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు.

రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల సమాశం

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ఫిబ్రవరి చివరన లేదా మార్చి మొదటి వారంలో వచ్చే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ పార్టీ ముందస్తుగానే ఈ ఎన్నికలకు సిద్ధమవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మూడు ఉమ్మడి జిల్లాల సమావేశాన్ని ఎన్‌సీఆర్‌డీలో నిర్వహించారు. ఈ సమావేశంలో నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాలపై చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డితో జరిగిన సమావేశంలో జిల్లాకు చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ముత్యాల సునీల్‌రెడ్డి, పి.వినయ్‌రెడ్డి, కామారెడ్డి నుంచి ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంత్‌రావులతో పాటు ఇతర జిల్లాల నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. పార్లమెంట్‌లో తాజా పరిస్థితిపై చర్చించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏ నియోజకవర్గంలో ఏ పరిస్థితి ఉంది, ఎవరు బలమైన అభ్యర్థులు ఉన్నారు, బీఆర్ఎస్, బీజేపీ నుంచి ఎవరు బరిలో ఉంటారు వంటి అంశాలను వివరించడంతో పాటు పార్టీ తరఫున గట్టి పోటీ ఇచ్చే నేతను నిలబెడుతామని సీఎం వివరించారు. పార్టీ నేతలంతా కలిసికట్టుగా పనిచేయడంతో పాటు నిలబెట్టిన అభ్యర్థులను అన్ని పార్లమెంట్‌లో గెలిపించాలని కోరారు. నిజామాబాద్ పార్లమెంట్ నుంచి ఎవరెవరు పోటీ చేయనున్నారో త్వరలో వివరిస్తామని సీఎం ఉమ్మడి జిల్లాల నేతలకు తెలిపినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ రాకముందే పలు సమావేశాలను నియోజకవర్గ స్థాయిలో నిర్వహించేందుకు సిద్ధం చేయడంతో పాటు పూర్తిస్థాయిలో పనిచేయాలని కోరారు. అన్ని అభివృద్ధి పథకాలను ప్రజలకు అందే విధంగా చూడాలన్నారు. వంద శాతం పారదర్శకంగా ఉండటంతో పాటు పనులు జరిగే విధంగా చూడాలన్నారు. కమీషన్లు, ఇతర ఆరోపణలు లేకుండా పనులు చేయాలన్నారు. ఎవరైనా గీత దాటితే తన పరిధిలో నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల పరిధిలో పూర్తిస్థాయిలో పనిచేయాలని వారికి దిశ నిర్దేశం చేశారు.

బీజేపీ పదాధికారుల సమావేశం

బీజేపీ నేతలు కూడా పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సాల్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికలపై చర్చించారు. ఆయా పార్లమెంట్ పరిధిలోని పరిస్థితులను పదాధికారుల సమావేశంలో చర్చించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న తాజా పరిస్థితిపై కూడా చర్చ చేశారు. ఈ సమావేశంలో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డితో పాటు రాష్ట్ర నేతలు పాల్గొన్నారు.

ఈ సమావేశంలోనే పార్లమెంట్ ఎన్నికల కోసం ఏ విధంగా పనిచేయాలో నేతలకు వివరించారు. సిట్టింగ్ స్థానాలను నిలబెట్టుకోవడంతో పాటు కొత్త స్థానాల్లో కూడా మెజార్టీ సీట్లను గెలుచుకునే విధంగా ప్రయత్నాలను చేయాలని కోరారు. అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలను కూడా నియమించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలకు కీలకమైన బాధ్యతలను అప్పచెప్పారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకు కరీంనగర్ లోక్‌సభ ఇన్‌చార్జిగా నియమించారు. పార్లమెంట్ ఎన్నికలు జరిగేంతవరకు ఆయన ఆ జిల్లా ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు. అక్కడి ఎన్నికల సరళిని పర్యవేక్షించడంతో పాటు క్యాడర్‌కు దిశ నిర్దేశం చేసి పార్టీ నేతలు కలిసి పనిచేసే విధంగా ఆయన పనిచేయనున్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన ఆధ్వర్యంలో పార్టీ నేతలు పనిచేసే విధంగా చూడాలని కోరారు. నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని నియమించారు. పక్కనే నిర్మల్ జిల్లా ఉండటం జిల్లా నేతలతో ఆయనకు పరిచయాలు ఉండటం వల్ల ఆయనను ఇన్‌చార్జిగా నియమించారు. పార్టీ నేతలతో సమన్వయం పర్చుకుంటూ పార్లమెంట్ ఎన్నికల కోసం సన్నద్ధమయ్యే విధంగా పార్టీ నేతలు ఈ నియామకాలను చేశారు.

బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిజామాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేష్‌గుప్త, జీవన్ రెడ్డి, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో శాసనసభ ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గాల వారీగా చర్చించారు. తమ హయాంలో పథకాలు అమలు చేసిన ఎందుకు ఓడిపోయాం, కొన్ని నియోజకవర్గాల్లో ఎందుకు ప్రజలు దూరమయ్యారు, ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతవరకు ఉంది, అభివృద్ధి పథకాల అమలు, ఎంపికలో అనుసరించిన పద్ధతి వల్లనే ప్రజలు మద్దతు పలకలేదా అనే అంశాలపై చర్చించారు.

కొంతమంది నేతల తీరుపై విమర్శలు రావడం ఇతర నేతలను నియోజకవర్గాలను రానివ్వకపోవడం వంటి అంశాలపై చర్చించడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అన్ని నియోజకవర్గాల పరిధిలో నేతలందరూ సమన్వయంతో పనిచేస్తూ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ దిశ నిర్దేశం చేశారు. పూర్తిస్థాయిలో ఇప్పటి నుంచే పార్లమెంట్ పరిధిలో పనులు చేపట్టాలని ఆదేశాలను ఇచ్చారు. ముఖ్యనేతలంతా కలిసికట్టుగా పనిచేసి నిజామాబాద్ పార్లమెంట్‌ను నిలబెట్టుకునే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. మూడు పార్టీల నేతలు ఒకేరోజు పార్లమెంట్ ఎన్నికలపై సమావేశం నిర్వహించడంతో ఆ పార్టీల క్యాడర్‌లో కూడా జోష్ పెరుగుతుంది. మూడు పార్టీల నేతలు చేపట్టే కార్యక్రమాలతో పార్లమెంట్ ఎన్నికల క్యాంపియేన్ ఈనెలాఖరులోపు మొదలయ్యే అవకాశం ఉంది. పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై ఇంకా ఏ పార్టీ మొదలు పెట్టలేదు.




సీఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ సమస్యలను వివరిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సునీల్‌కుమార్

- ముఖ్యమంత్రికి సమస్యలు వివరించిన కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్

మోర్తాడ్, జనవరి 8: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎంకు వివరించారు. నియోజకవర్గంలో అవసరమున్న పనుల గురించి తెలిపారు. అంతేగాక గత ప్రభుత్వంలో అభివృద్ధి పేరిట జరిగిన పనుల్లో అవినీతి అవకతవకలపై విచారణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సునీల్‌కుమార్ వెంట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.



త్వరలో నామినేటెడ్ పదవులు

- జిల్లాలోని సీనియర్ కాంగ్రెస్ నేతలకు త్వరలో నామినేటెడ్ పదవులు
- ఇప్పటికే వివరాలను సేకరించిన పార్టీ అధిష్ఠానం
- పనిచేసిన నేతలకు మొదట అవకాశం ఇవ్వనున్న సీఎం
- జిల్లా నేతలకు రానున్న రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు
- పార్టీలోని జిల్లాస్థాయి నేతలకు మార్కెట్ కమిటీలో అవకాశం

నిజామాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా కాంగ్రెస్ నేతలకు త్వరలో నామినేటెడ్ పదవులు రానున్నాయి. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం కూడా నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో ఆరు రోజుల క్రితం జరిగిన పీసీసీ సమావేశంలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. పదేళ్ల పాటు పార్టీ కోసం కష్టపడ్డ సీనియర్ నేతలకు మొదట అవకాశం ఇవ్వనున్నారు. ఈ పదవుల కోసం ఇప్పటికే జిల్లాకు చెందిన నేతలకు సంబంధించి సమాచారాన్ని కూడా అధిష్ఠానం సేకరించింది. దానికి అనుగుణంగానే సామాజిక సమీకరణాల ప్రకారం ఈ పదవులను కేటాయించనుంది. కొంత మందికి రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ పదవులను కట్టబెట్టనుండగా మరికొంత మందికి జిల్లా స్థాయిలోనే నామినేటెడ్ పోస్టులను ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సంక్రాంతి దాటిన తర్వాత ఈ పదవులను ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

సీనియర్ నేతలకు అవకాశం

జిల్లా కాంగ్రెస్‌లో దీర్ఘకాలికంగా పనిచేసిన నేతలకు నామినేటెడ్ పదవులు రానున్నాయి. పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఈ పదవులను ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలలోనే మంత్రివర్గ విస్తరణ చేసి జిల్లాకు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డికి అవకాశం ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం బట్టి తెలుస్తోంది. రాష్ట్రస్థాయిలో నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్ పరిధిలోని జిల్లాలకు మంత్రివర్గంలో ఇప్పటి వరకు తీసుకోలేదు. మొదట ఈ మూడు జిల్లాల నుంచి అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణతో పాటు నామినేటెడ్ పదవులకు కూడా ఈ నెలలోనే భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈనెల 20న సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనకు వెళ్తున్నారు. ఆలోపే ఈ పదవులలో కొన్ని భర్తీ చేయనున్నట్లు సమాచారం. జిల్లాలో సీనియర్ నేతలు ఏళ్లతరబడి పార్టీలో ఉన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా కూడా పార్టీని వీడి వెళ్లలేదు. పార్టీ కోసం కష్టపడి పనిచేశారు. శాసన సభ ఎన్నికల్లో కూడా వీరిలో కొంతమంది పోటీకి సిద్ధమయ్యారు. సీట్ల సర్దుబాటులో భాగంగా సీనియర్ నేతలకు కొంత మందికి అవకాశం ఇవ్వలేదు. వారందరికి ఇప్పుడు ఈ కార్పొరేషన్ పదవుల భర్తీలో అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రస్థాయిలో కొంత మందికి, జిల్లా స్థాయిలో కొంత మందికి నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. ఇప్పటికే జిల్లాలో ఉన్న సీనియర్ నేతలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ నేతలతో ఇప్పటికే చర్చించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. పెద్దల నుంచి అనుమతి రాగానే ఈ పదవులను భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్లు

జిల్లాలో కీలకంగా పనిచేసిన ఒకరిద్దరికి రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్లు ఇవ్వడంతో పాటు క్యాబినెట్ ర్యాంక్ కల్పించనున్నారు. మరికొంత మందికి రాష్ట్రస్థాయి పదవులను ఇవ్వనున్నారు. ఇవేకాకుండా జిల్లాలో ఉన్న నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయనున్నారు. జిల్లాలో మార్కెట్ కమిటీల పాలకవర్గాలు, నుడా, ఇతర నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నట్లు సమాచారం. సీనియర్ నేతలకు రాష్ట్రస్థాయిలో అవకాశం కల్పించి జిల్లా స్థాయి నేతలకు జిల్లాలోనే నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని సామాజిక సమీకరణాలు, ఆయా కులాలకు, మతాలకు అనుగుణంగా ప్రాతినిధ్యం వహించే విధంగా ఈ నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో, సీట్లలో సర్దుబాటు సమయంలో పనిచేసిన వారికి మొదట ఈ అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి స్థాయిలో ఇతర మంత్రులతో కలిసి నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఇప్పటికే చర్చించడం, ఆయా జిల్లాలో నేతలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని తీసుకోవడంతో పాటు ఇప్పటికే క్లారిటీకి వచ్చినట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పోస్టుల భర్తీకి రంగం సిద్ధం కావడంతో జిల్లాకు సంబంధించిన నేతలు కూడా పూర్తి స్థాయిలో ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. పార్టీ సీనియర్ నేతలను కలుస్తూ అవకాశాన్ని ఇవ్వాలని కోరుతున్నారు.



- వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

గడువులోగా సీఎంఆర్ లక్ష్యాన్ని సాధించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, జనవరి 8: నిర్దిష్ట గడువు లోపు సీఎంఆర్ లక్ష్యాన్ని సాధించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖ అధికారులతో సీఎంఆర్ ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. రైస్‌మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని వేగంగా మిల్లింగ్ జరిపించి కోటా మేరకు ఎఫ్‌సీఐకి బియ్యం నిల్వలు చేరేలా పర్యవేక్షణ చేయాలన్నారు. గత డిసెంబరు 31 నాటికే ఎఫ్‌సీఐకి సీఎంఆర్ కోటాను చేరవేయాల్సి ఉన్నప్పటికీ అనేక జిల్లాల్లో మిల్లింగ్ ప్రక్రియ పెండింగ్‌లో ఉండిపోయిందన్నారు. ఈనెల 21 వరకు గడువు పొడిగించినందున నిర్ణీత సమయంలో కస్టం మిల్లింగ్ రైస్ నిలువలు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రైస్‌మిల్లుల వారీగా పర్యవేక్షణ జరపాలని, మిల్లర్లు పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు మిల్లింగ్ జరిపేలా కృషి చేయాలన్నారు. ప్రతిరోజూ కనీసం 80 నుంచి 90 శాతానికి పైగా మిల్లింగ్ జరిపితే తప్ప నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా బియ్యం నిల్వలు చేరవేయడం సాధ్యంకాదని, దీనిపై అధికారులు నిరంతర పర్యవేక్షణ జరుపుతూ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలించాలని ఒకవేళ పక్కదారి పట్టినట్లు, అక్రమాలకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ దందాను నిరోధించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు.

అభయహస్తం దరఖాస్తులను సకాలంలో అప్‌లోడ్ చేయాలి: సీఎస్

ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా అభయహస్తం గ్యారెంటీలకు సంబంధించి ప్రజలనుంచి స్వీకరించిన దరఖాస్తులను సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా నిర్ణీత గడువు లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రోజువారి నమోదు తీరును పర్యవేక్షించాలన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు స్పందిస్తూ జిల్లాలో 4లక్షల 76వేల 321 దరఖాస్తులు వచ్చాయని ఇప్పటికే లక్షా 49వేల 953 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ప్రతి రోజూ కనీసం 60వేల దరఖాస్తులను అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఈనెల 17లోగా ఎలాంటి పెండింగ్ లేకుండా పూర్తిస్థాయిలో దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చిత్రమిత్ర, యాదిరెడ్డి, డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయిస్ డీఎం జగదీశ్, డీపీవో జయసుధ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లతో ఏర్పాటు చేసిన

ఫ్లెక్సీలపై విచారణ జరపాలి

● బీఎల్‌టీయూ డిమాండ్



నెహ్రూపార్క్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సుభాష్‌నగర్, జనవరి 8 : మున్సిపల్ ఉద్యోగుల సంఘం పేరుతో రాజకీయ పార్టీలను తలదన్నేలా లక్షల రూపాయలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అక్రమవసూళ్లు చేస్తున్న వారిపై విచారణ జరపాలని బీఎల్‌టీయూ నాయకులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం ఒక ప్రకటనలో మున్సిపల్ కార్పొరేషన్‌లో భవనాల టాక్స్ వసూలు చేసే ఓ ఉద్యోగి ఉద్యోగుల సంఘం పేరుతో కొంత మంది నగరంలో దాదాపు 150 ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. ఈ ఫ్లెక్సీలు నగరంలోని వివిధ వ్యాపార సంస్థల నుంచి పెద్ద ఎత్తున డబ్బు లు వసూలు చేసి పెట్టడం జరిగిందన్నారు. ఇటువంటి ఫ్లెక్సీలను నగరంలోని ప్రధాన చౌరస్తాతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు కూడా ఏర్పాటు చేశారన్నారు. ఈ ఫ్లెక్సీపై టిఫిన్ సెంటర్లు, హోటల్స్, షాపింగ్ మాల్స్ బిల్డర్స్ ఏర్పాటు చేసినట్లుగా ఉందన్నారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల ఫ్లెక్సీలు ఇంత పెద్ద ఎత్తు న పెట్టలేదని, అర్బన్ ఎమ్మెల్యేగా గెలిచిన సూర్యనారాయణ గుప్త ఫ్లెక్సీ కూడా ఇలా ఏర్పాటు చేయలేదన్నారు. అక్రమంగా ఏర్పాటైన ఫ్లెక్సీలపై విచారణ జరిపి వివిధ వ్యాపార సంస్థల నుంచి వసూలు చేసిన సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

మాల మహానాడు

నిజామాబాద్ రూరల్ అధ్యక్షుడిగా జె.గంగారాం

జక్రాన్‌పల్లి, జనవరి 8 : మాలమహానాడు నిజామాబాద్‌రూరల్ అధ్యక్షుడిగా జక్రాన్‌పల్లి మండలానికి చెందిన జె.గంగారాంను నియామించారు. ఈ మేరకు సోమవారం జె.గంగారాంకు నియామకపత్రాన్ని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు టి.సుధాకర్ అందజేశారు. ఈ సందర్భంగా జె.గంగారాం మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ నేతృత్వంలో పని చేస్తానన్నారు.

బాధిత కుటుంబాలకు రూ.37లక్షల చెక్కుల పంపిణీ



మోర్తాడ్‌లో బీమా చెక్కులను పంపిణీ చేస్తున్న యుబీఐ అధికారి

మోర్తాడ్, జనవరి 8 : మండల కేంద్రంలోని యుబీఐ బ్యాంకులో సోమవారం జిల్లా రిజినల్ అధికారి శంకర్ ఏఞం సుమారు రూ.30 లక్షల బీమా చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. బ్యాంకు ఖాతాదారులైన ముప్పారం రాజేశ్వర్ ప్రమాదవశాత్తు మరణిస్తే ఆయన రూ.30లక్షల బీమా మంజూరైందని, అంతేగాక పోస్టుమెన్ రమేష్‌కు కూడా ప్రమాదవశాత్తు చనిపోవడంతో రూ.7లక్షల 75వేల ప్రమాద బీమా మంజూరైందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యుబీఐ మార్కెటింగ్ అధికారి పృథ్వీ, స్థానిక మేనేజర్ సతీష్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది, సతీష్, రమ్య, జలజ, స్థానిక ఉపసర్పంచ్ సొక్కాయి గంగారెడ్డి, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సాయిబాబాకు 108 రకాల నైవేద్యాలు



108 రకాల మిఠాయిలతో సాయిబాబాకు నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

ముప్కాల్, జనవరి 8 : ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం వద్ద గల సాయిబాబా మందిరంలో సాయి సహస్ర పారాయణంలో భాగంగా సోమవారం 108 రకాల స్వీట్‌లతో సాయిబాబాకు నైవేద్యాలు, దీపోత్సవం నిర్వహించారు. శ్రీ అవదూతానంద సరస్వతిస్వామి దివ్యాశీస్సులతో ప్రారంభమైన పారాయణంలో 108మందికిపైగా భక్తులు పాల్గొని గురుపారాయణం నిర్వహించారు. ప్రతీరోజు ముప్కాల్ భజన మండలి వారి ఆధ్వర్యంలో సాయిభజన సంకీర్తలు వైభవంగా జరుగుతాయి. ఇందులో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటారు. చపన్‌బోగ్ వారి సహకారంతో 108రకాల వంటకాలతో సాయిబాబాకు నైవేద్యాలు సమర్పించినట్లు సాయిసేవ సమితి సభ్యులు తెలిపారు. అంతకు ముందు ఆదివారం రాత్రి దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. భక్తులందరు కలిసి స్వస్తిక్ ఓంచక్రం ఆకారాలతో కూడిన దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో సాయిసేవ సమితి సభ్యులు, పారాయణం భక్తులు, వీడీసీసభ్యులు, గ్రామస్థులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

రెంజల్,జనవరి8: మండలంలోని నీలా గ్రామంలో అక్రమంగా డంప్ చేసిన నాలుగు ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయం నందు డంప్ చేయడం జరిగిందని ఇట్టి ఇసుకను గురువారం వేలం వేయడం జరుగుతుందని తహసీల్దార్ రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వఆరు రెంజల్ తహసీల్దార్ కార్యాలయానికి మధ్యాహ్నం 12గంటలకు వచ్చి వేలంలో పాల్గొనాలని అన్నారు.

'జీవో నెం.2ను ఉపసంహరించుకోవాలి'

బోధన్ రూరల్, జనవరి 8 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్స్ సమ్మెపై అత్యవసర సర్వీసుల చట్టం ప్రయోగిస్తూ విడుదల చేసిన జీవో నెం.2ను ఉపసంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు పుట్ట వరదయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని డిసెంబర్ 12 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ టీచర్లు సమ్మె చేపట్టారు. ఎన్నిసార్లు నిరసన తెలిపినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల లో తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు సమ్మెకు దిగారన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సామాజిక భద్రత కల్పించాలని వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. నియంతృత్వ పద్ధతిలో సమ్మెను అణచివేయాలని జగన్ ప్రభుత్వం చూస్తుందని ఇది దుర్మార్గపు పాలన అని ఆయన ఆరోపించారు. ఎస్మాను ఉపసంహరించుకుని అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కోళ్ల పందెం నిర్వాహకులను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

పొతంగల్‌లో కోళ్ల పందెం స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

కోటగిరి,జనవరి8: పొతంగల్ శివారులో కోళ్ల పందెలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. పొతంగల్ మంజీర నది శివారులో సోమవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ సీఐ అజయ్ బాబు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కోళ్ల పందెల నిర్వహణకు నిర్వాహకులు సమాయత్తం అయ్యారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల రాకను గమనించిన నిర్వాహకులు అక్కడి నుంచి పరారీ అయ్యేందుకు ప్రయత్నించారు. పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 29,170రూపాయల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పందెం కోళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయన వెంట కోటగిరి ఎస్ఐ సందీప్‌న్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

నవీపేట,జనవరి8: మండలంలోని బినోలకు చెందిన పందిరి స్వప్న, భట్టు లక్ష్మిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదగిరిగౌడ్ తెలిపారు. ఈ నెల 7న ఇంటి సమీపంలో ఉన్న వీరు పరస్పరం ఒకరిపై ఒకరు దూషించుకుంటూ దాడులు చేసుకున్నారని ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షేమ ఫలాలు బలహీనవర్గాలకు అందేలా కృషి చేయాలి

● కేంద్ర ఆహార ప్రజా పంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి అశ్విని శ్రీవాస్తవ్


మాట్లాడుతున్న కేంద్ర ఆహార ప్రజా పంపిణీ శాఖ సంయుక్తకార్యదర్శి అశ్విని శ్రీవాస్తవ్


క్యాలెండర్‌ను ఆవిష్కరించిన బీజేపీ నాయకులు


కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్, జనవరి8: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు బలహీన వర్గాలకు చేరేలా అధికారులు కృషి చేయాలని కేంద్ర ఆహార ప్రజా పంపిణీ శాఖ సంయుక్తకార్యదర్శి అశ్విని శ్రీవాస్తవ్ అన్నారు. సోమవారం ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అశ్విని శ్రీవాస్తవ్ మాట్లాడుతూ అర్హులైన వారు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకున్నప్పుడే ప్రభుత్వ సంకల్పం నెరవేరి ఆయా పథకాలకు సార్థకత చేకూరుతుందన్నారు. వివిధ వర్గాల వారి కోసం కేంద్రం అమలు చేస్తున్న పథకాల గురించి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన ప్రతీఒక్కరికి లబ్ధిచేకూర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహిస్తుందన్నారు. పేదప్రజలకు మౌలిక సదుపాయాలైన ఎల్‌పీజీ కనెక్షన్‌లు, పక్క ఇళ్లు, ఆహార భద్రత, పౌష్టికాహారం, మెరుగైన వైద్యం, నాణ్యమైన విద్య, స్వచ్ఛమైన తాగునీరుతో పాటు ఆర్థిక సహాయం లాంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని అర్హులైన లబ్ధిదారులు వీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు, గోడప్రతులు, క్యాలెండర్‌లు ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, డీఎల్‌పీవో శ్రీనివాస్, సర్పంచ్ దార్ల దివేన, ఎంపీటీసీ లినిత, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో హరికృష్ణ, ఎంఈవో రాజగంగారాం,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,పాల్గొన్నారు.

అంకాపూర్‌లో..

మండలంలోని అంకాపూర్ గ్రామంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిశోర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఎంసీ.గంగారెడ్డి, మహేందర్, ఏవో హరికృష్ణ, ఎంఈవో రాజగంగారాం, మండల పరిషత్ సూపరిండెంట్ లక్ష్మీ, ఏపీవో సురేష్, తదితరులు పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పాతబస్టాండ్‌లో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఉజ్వల పథకం, సుకన్య సమృద్ధి యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి యోజన, ఫసల్‌బీమా యోజనలతో పాటు వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పసుపుబోర్డు మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రధానమంత్రి పథకాల క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ.నర్సింహారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, అసెంబ్లీ కన్వీనర్‌పాలెపు రాజు, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, పులి యుగంధర్, పీర్‌సింగ్, మహిళ మోర్చనాయకురాలు స్వభవికగౌడ్, పద్మ, సునీత, నిఖిత, మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, బ్యాంకు అధికారులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోటగిరి: దేశ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని అడ్కాస్‌పల్లి, దేవునిగుట్ట తండా గ్రామాలలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సాబ్ కా సాత్ సాబ్ కా వికాస్ నినాదంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నవ భారత నిర్మాణంలో అమృత కాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఔన్నత్యంపై ప్రధాని సందేశాన్ని వినిపించి ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. బీమా, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పోషణ్ అభియాన్ సేవలు పొందాని, చిన్న పిల్లల్లో పోషకాహార లోపం అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మారుతి, ఏపీవో గంగారాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణి, ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, సర్పంచ్‌లు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన డాటా ఎంట్రీ పనులు


కొనసాగుతున్న ప్రజాపాలన డాటా ఎంట్రీ పనులు

భీమ్‌గల్‌రూరల్, జనవరి8: ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన ఆరు గ్యారంటీల దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 6తో ముగిసింది. మొత్తం మండలంలో 15550 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవోరాజేశ్వర్ తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ ఆన్‌లైన్‌లో ఆయాగ్రామాల వారిగా వచ్చిన దరఖాస్తు ఫారాలను ఎంపీడీవో కార్యాలయంలో డాటా ఎంట్రీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో ఎంట్రీ పనులు పూర్తవుతాయని అన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఎంట్రీ షురూ

● రూరల్ సిబ్బందితో ఆన్‌లైన్ నమోదు

● రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్న సిబ్బంది ● రూరల్‌లో 8684 దరఖాస్తులు

నిజామాబాద్ రూరల్, జనవరి 8: సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్‌ప్రక్రియ వేగవంతం చేశారు. రూరల్ మండలంలో మొత్తం 8684 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీవో మధురిమ తెలిపారు. మండలంలోని 19 గ్రామాల్లో లబ్ధిదారులనుంచి దరఖాస్తులు స్వీకరించారు. వీటికి సంబంధించి ప్రభుత్వం ఆన్‌లైన్ నమోదు చేయాలని ఆదేశించింది. దాంతో రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక కంప్యూటర్‌సెల్‌ను ఏర్పాటుచేశారు. మండలంలోని కంప్యూటర్ ఆపరేటర్లతోపాటు పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో ఆన్‌లైన్ నమోదుచేస్తున్నారు. ప్రతీరోజు రెండు షిఫ్టుల్లో సిబ్బంది ఆన్‌లైన్‌చేస్తున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు తిరిగి రాత్రి 8గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మరో షిఫ్టును నిర్వహిస్తున్నారు.మొత్తం 8684 దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3010 దర ఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు ఎంపీవో మధురిమ తెలిపారు. సిబ్బంది ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను ఎంపీవో మధురిమ దగ్గరుంచి పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 12లోపు పూర్తి దరఖాస్తులను పూర్తిచేయనున్నట్లు తెలిపారు.

ముప్కాల్‌లో శివాజీ విగ్రహానికి భూమిపూజ

ముప్కాల్, జనవరి8: ముప్కాల్ మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు సోమవారం ఎంపీపీ సామ పద్మ, జడ్పీటీసీ బద్దం నర్సవ్వ కలిసి భూమిపూజ చేశారు. 44వ జాతీయ రహదారి నుంచి గ్రామానికి ప్రవేశించే రహదారి మధ్యలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడానికి భూమిపూజ చేశారు. ఈ విగ్రహాన్ని ఛత్రపతి శివాజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శివాజి మహరాజ్ మరాఠ సామ్రాజ్యం నెలకొల్పి మొగల్ సామ్రాజ్యాన్ని ఎదురించిన వీరుడని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు నాయకుడు పద్మ, మండల బీఆర్ఎస్ సీనియర్ పార్టీ నాయకులు సామ వెంకట్‌రెడ్డి, బద్దం నర్సారెడ్డి, నాయకుడు కిషన్, వీడీసీసభ్యులు, శివాజీ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు గన్‌మెన్‌ల తొలగింపు

ఖిల్లా, జనవరి 8: పోలీస్‌శాఖ ద్వారా ప్రజాప్రతినిధులకు నియమించే గన్‌మెన్‌లను తొలగించినట్లు తెలిసింది. గతంలో ప్రాణభయం ఉన్న ప్రజాప్రతినిధులు దరఖాస్తు చేసుకుంటే వారిపై నిఘా వర్గాల వారు (ఇంటెలిజెన్స్) పూర్తి వివరాలు సేకరించి వారికి గన్‌మెన్‌లను నియమించేవారు. ప్రాణభయం (థ్రెటనింగ్) లేని ప్రజాప్రతినిధులకు గన్‌మెన్‌లను తొలగించారు. వీరిలో నగర మేయర్ దండునీతూకిరణ్, తారిక్ అన్సారి, మార గంగారెడ్డి, మధుశేఖర్‌లు ఉన్నారు.

వికలాంగుడికి ట్రై సైకిల్ అందజేత

నందిపేట, జనవరి 8:మండలంలోని కంఠం గ్రామానికి చెందిన జంగం సిద్ధయ్యకు ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం ట్రైసైకిల్ అందజేశారు. గ్రామానికి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పర్యటించిన సందర్భంలో వికలాంగుడైన తనకు ట్రై సైకిల్ ఇవ్వాలని కోరాడు. ఆయన కోరిక మేరకు స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జంగం సిద్ధయ్యకు సైకిల్‌ను అందజేశారు. సైకిల్‌ను అందజేసిన వారిలో చిన్న, సాయి, రవి, తదితరులు ఉన్నారు.

నాళేశ్వర్, బినోలలో గ్రామసభలు

నవీపేట,జనవరి8: మండలంలోని నాళేశ్వర్, బినోలలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించిన గ్రామసభలు నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంట పొలాలకు డ్రోన్ సహాయంతో రసాయనిక ఎరువులు చల్లే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఆర్ఐ మోహన్, ఏవో సురేష్ గౌడ్, ఏపీఎం భూమేష్ గౌడ్, మెడికల్ ఆఫీసర్ సామ్రాట్ యాదవ్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్ కుమార్, నాళేశ్వర్ సర్పంచ్ నరిన్, ఉపసర్పంచ్ పోశెట్టి తదితరులున్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

మోస్రా,జనవరి8: మండల కేంద్రంతో పాటు చింతకుంట, గోవూర్, తిమ్మాపూర్ గ్రామాలలో సోమవారం అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. 22వ తేదీన ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి అయోధ్య రామాలయం దివ్య కాంతులను చూసి ఆనందించాలని కార్యకర్తలు భక్తులను కోరారు.ఈ కార్యక్రమంలో భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

ఏర్గట్ల, జనవరి 8: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో సోమవారం మండల పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఎంఈవో అంధ్రయ్య కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణచారిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు శేర్ల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

కోటగిరి,జనవరి8: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన సంపంగి మౌనిక(25)అనే వివాహిత అనుమానాస్పద స్థితి మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. భార్యభర్తల మధ్య గత కొంతకాలంగా కుటుంబ కలహాలు నెలకొని ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున భర్త మహేష్ పౌల్ట్రీ ఫారంలో పని చేసేందుకు వెళ్లాడు. అనంతరం మౌనిక ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య యత్నానికి ఒడిగట్టింది. మృతురాలి తనయుడు తండ్రికి సమాచారం అందించగా వచ్చి చూసేసరికి మౌనిక మృతి చెందింది. మృతురాలి బంధువులు భర్తే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు ఆరోపించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలోమృతి చెందినట్లు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిపోయిన యువకుడి మృత్యువాత

● అనుమానాస్పదంగా యువకుడి మృతి

● పదిరోజులకు మృతదేహం లభ్యం ● కేసు నమోదు చేసిన పోలీసులు


నరేష్ (ఫైల్)

ఇందల్వాయి, జనవరి 8: గత నెల 30వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన యువకుడు మృత్యువాత పడ్డాడు. అనుమానాస్పద స్థితిలో బండరాళ్ల మధ్య యువకుడి మృతదేహం పడి ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంగల్‌పాడ్ తండాకు చెందిన లావుడ్య నరేష్ అనే (21) డిసెంబర్ 30వ తేదీన ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడని చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో వెతికిన కుటుంబ సభ్యులు జనవరి 1వ తేదీన ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నరేష్ తల్లి నీలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐపీసీ సెక్షన్ 302, 201 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. అప్పటి నుండి యువకుడి జాడ కోసం వెతుకుతున్నామని సోమవారం ఇందల్వాయి మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వెనకాల రైలుపట్టాల వద్ద ముళ్ల పొదల్లో బండరాళ్ల మధ్య మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పరిశీలించి నరేష్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో నరేష్ వదిన జ్యోతి, మరికొంత మంది తండావాసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహం పైఉన్న దుస్తుల ఆధారంగా నరేష్ మృతదేహంగా గుర్తించినట్లు తెలిపారు.మృతుడికి గత మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగిందన్నారు. మృతుని భార్య అనురాధా నెల రోజుల క్రితం రెండో కుమార్తెకు జన్మనివ్వడంతో పుట్టింటి వద్దే ఉందని అన్నారు. మృతుడు మద్యానికి బానిసై అప్పులు చేశాడని చెప్పారు. మృతుని తల్లి నీలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పంచనామా నిమిత్తం మృతదేహాన్ని నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ కృష్ణ తెలిపారు.

వీర జవాన్ల కుటుంబాలకు చెక్కుల అందజేత

నిజామాబాద్ అర్బన్, జనవరి 8: ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్‌డే ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని సోమవారం ఉమ్మడి జిల్లా నుంచి ఆర్మీలో విధులు నిర్వహిస్తు సర్వీసులో మరణించిన ముగ్గురు సైనికుల యొక్క కుటుంబాలకు సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు చెక్కులను అందజేశారు. ఇందల్వాయి మండలం చంద్రయాన్‌పల్లికి చెందిన చెవుల ప్రశాంత్ భార్య సుకన్యకు, బోధన్ మండలం కూమన్‌పల్లికి చెందిన నీరడి గంగాప్రసాద్ భార్య నీరడి శిరీషకు, కామారెడ్డికి చెందిన ఈగజైపాల్ భార్య ఈగస్వరూపకు ఒక్కొక్కరికి 3లక్షల చొప్పున చెక్కులను కలెక్టర్ అందజేశారు. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫండ్‌కు సిరికొండకు చెందిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు అందించిన 50వేల చెక్కును పాఠశాల ప్రిన్సిపల్ నర్సయ్య కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యాన్ని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్స్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



పెన్షనర్స్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జనవరి 8: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ప్రజావాణిలో ఆవిష్కరించారు. పుట్టిన తేదీ రికార్డులో లేని ఫ్యామిలీ పెన్షనర్లు అదనపు పెన్షన్లు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారని దీనిని తమకు న్యాయం చేయాలని పెన్షనర్లు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చిత్రమిశ్ర, యాదిరెడ్డి, మున్సిపల్ కమీషనర్ మకరంద్, జిల్లా అధికారులు రసూల్‌బీ, జయసుధ, సంఘం ప్రతినిధులు రామ్మోహన్‌రావు, మదన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ మృతిపట్ల జిల్లా అధికారుల సంతాపం

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్ శివశంకర్ మృతి పట్ల జిల్లా అధికార యంత్రాంగం సోమవారం సంతాపం వ్యక్తం చేసింది. 2021 ఫిబ్రవరిలో జిల్లాలో లేబర్ డిప్యూటీ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శివశంకర్ ఈనెల 6న చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి సంతాపంగా జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేశారని కమిషనర్‌కు ఫిర్యాదు

- ఓ యూనియన్ నాయకుడు సహకరిస్తున్నాడని ఆరోపణ

సుభాష్‌నగర్, జనవరి 8:నగరంలోని ఎల్లమ్మగుట్టలో సుమారు 200ల చదరపు గజాల మున్సిపల్ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకుని నిర్మాణం చేశారని మున్సిపల్ కమీషనర్‌కు ఎల్లమ్మగుట్టకు చెందిన అందే నారాయణ ఫిర్యాదు చేశారు. స్థలం కబ్జా చేసిన వ్యక్తికి మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన యూనియన్ నాయకుడు సహకరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైకోర్టు నుంచి అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని ఉత్తర్వులు పొందిన కార్యాలయంలో పని చేసే నాయకుడు అక్రమ నిర్మాణాన్ని కాపాడుతూ ఇతరులకు నిర్మాణానికి అడ్డుపడుతున్నాడని అన్నారు. అక్రమ నిర్మాణం చేసి నిర్మాణ అనుమతికి వ్యతిరేకంగా బిల్డింగ్ నిర్మానం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని అక్రమ నిర్మాణానికి సహకరించిన మున్సిపల్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కలుషితమైన నీటి సరఫరాపై ట్వీట్

- కలుషితమైన నీటితో డయేరియా బారిన పడుతున్న ప్రజలు
- ముఖ్యమంత్రికి, ముఖ్య కార్యదర్శికి ట్వీట్ చేసిన డిప్యూటీ మేయర్



టబ్బులో మురికి నీరు.. పక్కన డిప్యూటీ మేయర్ చేసిన ట్వీట్

సుభాష్‌నగర్,జనవరి 8: నగర పాలక సంస్థ తాగునీటి సరఫరాలో కలుషితనీరు వచ్చిరోగాల పాలవుతున్నారని స్వయంగా డిప్యూటీమేయర్ ఇద్రీస్ ఖాన్ ట్వీట్ చేయడం మున్సిపల్ సిబ్బంది తీరు నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రతీ ఇంటికి సురక్షితమైన తాగునీరు అందిస్తున్నామని చెబుతున్న క్షేత్రస్థాయిలో మాత్రం ఆ ఊసే కనబడడం లేదు. గత కొన్ని రోజులుగా నగరశివారు ప్రాంతాలతో పాటు ప్రధాన కాలనీల్లో మున్సిపల్ సరఫరా చేస్తున్న తాగునీరు రంగుమారి, దుర్గంధంతో వస్తోంది. పైపులైన్లు లీకేజీలు జరిగిన చోట రోజుల తరబడి మరమ్మతులు చేయకపోవడతో ఈ సమస్య ఉత్పన్నం అవుతున్నట్లు తెలిస్తుంది. ఈవిషయమే స్వయంగా ప్రస్తుత మున్సిపల్ కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ సీఎం రేవంత్‌రెడ్డికి, మున్సిపల్ కార్యదర్శికి ట్విట్టర్ ద్వారా తెలియజేయడం సంచలనం సృష్టించింది. డిప్యూటీ మేయర్ చేసిన ట్విట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.గత కొన్ని రోజులుగా నగర ప్రజలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నా ప్రజాప్రతినిధులకు తెలియకపోవడంతో సమస్యగానే మిగిలింది. ఈట్విట్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో అధికారులుదిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

టీయూలో బయోఇన్ఫర్మెటిక్స్‌పై సదస్సు

డిచ్‌పల్లి, జనవరి 8: తెలంగాణ యూనివర్సిటీలోని సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ బయోఇన్ఫర్మెటిక్స్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. రోల్ ఆఫ్ బయోఇన్ఫర్మేటిక్స్ ఇన్ అండర్ సెల్.. అనే అంశంపై ఒక రోజు వర్క్ షాపు బయోఇన్ఫర్మెటిక్స్‌లో విశ్లేషించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రైమ్ మినిస్టర్ రిసార్చ్ ఫెలోషిప్ ముకులిక, శారదలు పీజీ విద్యార్థినులకు రిసార్చ్ స్కాలర్‌కు ప్రాక్టికల్ సెషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డీన్ ఫ్యాకల్టీ ప్రొ.ఆరతి మాట్లాడుతూ .. బయోటెక్నాలజీ విభాగానికి వర్క్ షాపు నిర్వహించడంతో ఆమె అభినందించారు. ఈ వర్క్ షాపులో బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డా.ప్రవీణ్ మామిడాల, ఫ్యాకల్టీ ఆఫ్ స్టడీస్ డా.జవేరియ ఉజ్మ, మాట్లాడుతూ.. కాంపోనెంటల్ సౌకర్యాలు కల్పించినందుకు వర్సిటీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

'ప్రజావాణి'లో ఫిర్యాదుల వెల్లువ

- కలెక్టర్‌కు 63 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జనవరి 8: ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌ గాంధీ హన్మంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 63 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చిత్రమిశ్ర, యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, డీఆర్‌డీవో చందర్, డీపీవో జయసుధ, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్‌లు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ప్రజావాణి వినతులపై తక్షణమే స్పందించాలి: కలెక్టర్

ప్రజాసమస్యల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లాకు సంబంధించి ప్రజలు అందించే వినతులపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించాలన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రజావాణి కార్యక్రమం వినతులను శాఖల వారిగా పంపించడం జరుగుతుందని వాటిని వెంట వెంటనే పరిశీలిస్తూ పరిష్కరించాలన్నారు. వినతులపై చేపట్టిన చర్యల గురించి వివరిస్తూ సమగ్ర నివేదికలు పంపించాలన్నారు. ఒకవేళ వినతులు పరిష్కారం కాకపోతే అందుకుగల కారణాల ను తెలియజేయాలన్నారు. ప్రజావాణి వినతులపై చేపట్టిన చర్యలపై సంబంధించి ఇకపై వారం వారం సమీక్ష నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

● మధ్యాహ్న భోజన బకాయిలు చెల్లించాలి

మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ ఆరు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులు బిల్లులు రాక అవస్థలు పడుతున్నారని కావున వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అధికారులు వేదిస్తున్నారని మార్కెట్‌లో మాత్రం కూరగాయలు, పప్పుదినుసుల రేట్లు పెరిగిపోతున్నా బిల్లులు మాత్రం ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా వెంటనే స్లాబ్ రేట్లు పెంచి బిల్లులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో చామంతి లక్ష్మి, కొండ గంగాధర్, సురేందర్‌రెడ్డి, శిరీష, సుజాత తదితరులు పాల్గొన్నారు.

● బీసీ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని వినతి...

ధర్మారంలోని జ్యోతిభాపూలే బీసీ హాస్టల్‌లో సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హాస్టల్ నిర్వహకులు విద్యార్థులకు సరిగా భోజనాలు పెట్టడం లేదని కావున వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జాతీయ బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నవాతే ప్రతాప్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

● రైస్‌మిల్ ఆపరేటర్ల ధర్నా

తెలంగాణ కార్మికులకే మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పించాలని వేతనాలు కూడా పెంచాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రైస్‌మిల్ ఆపరేటర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ గతంలో రైస్‌మిల్ ఇండస్ట్రీలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కార్మికుల వేతనాలు పెంచుకోవడం ఆనవాయితీగా వస్తుందని గత వేతన ఒప్పందం అక్టోబర్ 31తో ముగిసిన నవంబర్ నుంచి కొత్త వేతనాలు అమల్లోకి రావాల్సి ఉన్నా రైస్‌మిల్ యజమానులు ఇవ్వడం లేదని కావున వెంటనే వేతనాలు పెంచి కార్మికులందరికి పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు.

మెండోర: మండలంలో బుస్సాపూర్ గ్రామంలో శ్రీ పవన్ బ్రిలియంట్ పాఠశాలలో అక్రమంగా నిర్వహిస్తున్న గురుకుల కోచింగ్ సెంటర్‌పై జిల్లా బీసీ విద్యార్థి సంఘం జనరల్ సెక్రెటరీ ద్యాగ శేఖర్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా శ్రీ పవన్ బ్రిలియంట్ పాఠశాలలో అక్రమంగా గురుకుల కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారని పేద, మధ్య తరగతి విద్యార్థులకు లక్ష్యంగా చేసుకొని తల్లిదండ్రులతో పక్క సీటు గ్యారెంటీ అని చెప్పి అధిక మొత్తంలో 30 నుంచి రూ.40వేలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల జిల్లా విద్యాధికారులు కల్లుకప్పి పేద విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి అధిక మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి గురుకుల కోచింగ్‌లపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వెంటనే డీఈవోకు విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు.



ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘ నాయకుడు

● మోర్తాడ్‌లోని ప్రైవేటు పాఠశాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మోర్తాడ్: మండల కేంద్రంలోని కృష్ణవేణి హైస్కూల్‌పై బీసీ విద్యార్థి సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీ ద్యాగశేఖర్ పటేల్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కృష్ణవేణి పాఠశాలలో ప్రైమరీ స్కూల్ అనుమతులు తీసుకొని అక్రమంగా హైస్కూల్ నడుపుతున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై మండల విద్యాధికారి పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకువచ్చిన స్పందించడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని ఆయన అన్నారు. సంబంధిత అధికారులపై కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని శేఖర్‌పటేల్ డిమాండ్ చేశారు. పర్మిషన్‌లు ఏలాంటివి కూడా కృష్ణవేణి పాఠశాలకు లేవని ఆయన అన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి కృష్ణవేణి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జిల్లా వ్యాప్తంగా అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

డిచ్‌పల్లి, జనవరి 8: ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో అయోధ్యరాముని అక్షింతలు ఇంటింట తిరుగుతూ పంపిణీ చేశారు.ఈ నెల 22న అయోధ్యలో రాముని ప్రారంభోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న హిందూ బంధువుల అందరికీ రాముని అక్షింతలు పంపిణీలో భాగంగా డిచ్‌పల్లిలో ఈకార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం)లో సోమవారం అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతల కళశానికి శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక హనుమాన్ మందిరంలో కళశానికి పూజలు నిర్వహించి గ్రామంలోని పలు వీధుల గుండా కళశానికి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగహారతులతో శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ సాయిలు, శివ, కళ్యాణ్, వినీత్, చందు తదితరులున్నారు.

రెంజల్: మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో సోమవారం అయోధ్య రాముడి పూజిత అక్షింతలను రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భజభాజంత్రీల మధ్య మంగళవాయిద్యాలతో పల్లకిలో ఊరేగించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భజన కార్యక్రమాలతో రాముల వారి చిత్రపటం, అక్షింతలను మంగళహారతుల మధ్య ఊరేగింపు నిర్వహించి ప్రతి ఇంటికి అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రామాలయం చైర్మన్ సుధాకర్ రావు, మాజీ ఎంపీటీసీ నర్సయ్య, హన్మంత్ రావు, ప్రసాద్, నాగోజి, రూపేష్, నాగనాథ్, నర్సారెడ్డి, ప్రభాకర్, నవీన్, దత్తు పటేల్, విజయ్, గోపాల్ పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలో సోమవారం అయోధ్య రాముడి అక్షింతలు ఊరేగించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అక్షింతలు తీసుకుని వచ్చిన వారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కోటగిరిలో అయోధ్య అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

సంక్రాంతి సెలవులకు వెళ్లేవారు సూచనలు పాటించాలి

ఖిల్లా,జనవరి 8:సంక్రాంతి పండుగ సెలవులకు వెళ్లే వారు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పకుండా పాటించాలని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగేనేవారు తెలిపారు. విలువైన వస్తువులను, బంగారు ఆభరణాలు, నగదు లాకర్లలో భద్రపర్చుకోవాలి, గ్రామాల్లోని ప్రజలు సంబంధిత పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలి, ఎప్పుడు వెళ్తున్నారు. ఎప్పుడు వస్తున్నారు లాంటి వివరాలను పోలీసులకు ఇవ్వాలి, సీసీటి.వీలు పనిచేసే విధంగా మంచి కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలి, అపరిచిత వ్యక్తులు వస్తే వారిసమాచారం పోలీసు వారికి తెలియజేయాలి, శివారు ప్రాంత కాలనీల్లో తాళం వేసిన ఇళ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ గుర్తించి, రాత్రి వేళ చోరీలకు పాల్పడే అవకాశాలు ఉంటాయి, అటువంటి వారిపై నిఘా ఏర్పాటు చేయాలి, ఇరుగు పొరుగు వారిని ఇంటిని కనిపెట్టి ఉండాలని తెలియజేయాలి, పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి, ఇంట్లో కుటుంబసభ్యులు వెళ్లగా ఉన్న మహిళలు, వృద్ధులు, అపరిచితులు సమాచారం పేరుతో వస్తే నమ్మకండి, ఊరు వెళ్లే సమయంలో ఖరీదైన వస్తువులు ఉంచడం మంచిది కాదు, కాలనీల వారిగా గస్తీదళాలును ఏర్పాటు చేసుకోవాలి, తాళం వేసి ఊరు వెళ్లేవారు ముందు మీ సమీప పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి, పోలీసు శాఖ వారికి దొంగతనాలపై అనుమానితుల సమాచారం అందించాలి, ఎప్పటికప్పుడు సమచారం ఇవ్వదలుచుకున్న వారు డయల్ 100కు, సమాచారం ఇవ్వడానికి సద్వినియోగం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల దొంగతనాలను నివారించడం జరుగుతుందన్నారు.

మహిళలు బస్సు ప్రయాణాల్లో ఒరిజినల్ గుర్తింపు కార్డులను చూపించాలి

బోధన్ రూరల్, జనవరి 8 : ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణాల్లో భాగంగా బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలు తమ ఒరిజినల్ గుర్తింపు కార్డులను తప్పనిసరిగా కండక్టర్‌కు చూపించి సహకరించాలని బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాన్ కార్డు అడ్రస్ లేనందున ఉచిత ప్రయాణానికి చెల్లు బాటు కాదన్నారు. ఆధార్, ఇతర ఒరిజినల్ గుర్తింపు కార్డులను చూపించాలని పదే పదే చెబుతున్నా కొంత మంది మహిళలు ఫోన్‌లలో, మరికొంత మంది కలర్ జిరాక్స్‌లను చూపిస్తున్నారని, ఇది సరికాద న్నారు. మహిళా ప్రయాణీకులందరూ తప్పకుండాఒరిజినల్ గుర్తింపు కార్డులను చూపించి జీరో టికెట్‌లను తీసుకోవాలని కోరారు. ఒరిజినల్ గుర్తింపు కార్డు లేకుంటే ఖచ్చితంగా డబ్బులు చెల్లించి టికెట్ తీసుకో వాలని విజ్ఞప్తి చేశారు. మహాలక్ష్మీ పథకం తెలంగాణ ప్రాంత మహిళలకే వర్తిస్తు ందని, ఇతర రాష్ట్రాల మహిళలు చార్జీలు చెల్లించి విధిగా టికెట్ తీసు కుని సహకరించాలని కోరారు.ఈకార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తెలంగాణ భవన్‌కు తరలి వెళ్లిన రూరల్ నేతలు

నిజామాబాద్ రూరల్, జనవరి 8: నిజామాబాద్ పార్లమెంట్ ముఖ్యకార్యదర్శుల సమావేశానికి రూరల్ మండలం నుంచి బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున హైదరాబాద్ తరలివెళ్లారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. రూరల్ మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ ఛైర్మన్‌లు సమావేశానికివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి మండలంలోని పరిస్థితులు చర్చించారు. పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులను బాజిరెడ్డి సూచించారు. బాజిరెడ్డిని కలిసినవారిలో అశోక్, అన్నంసాయిలు, మధుకర్, అక్బర్‌నవాజుద్దీన్, శ్రీధర్, సాలుగారి మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, కొర్వ గంగాధర్, గంగారాం నాయక్ తదితరులున్నారు.

జిల్లా వ్యాప్తంగా పంటల నమోదును పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్

డిచ్‌పల్లి, జనవరి 8: జిల్లాలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను పకడ్బందీగా వ్యవసాయశాఖ అధికారులు వివరాలు నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్ వ్యవసాయాధికారులకు సూచించారు. సోమవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నడిపల్లి రైతు వేదికలో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయాధికారులు, విస్తీర్ణాధికారుల సమీక్షా సమావేశానికి జేడీఏ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా పంటల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఏ గ్రామాల్లో ఏ రకం పంటలు రైతులు సాగు చేస్తున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేయాలని ఆయన సూచిం చారు. పంటల సాగుకు రైతులకు సరిపడ ఎరువులు, అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రైతాంగానికి రైతు భరోసాపై కావాల్సిన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు,ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీఏ వాజీద్ హుస్సేన్

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

వర్ని,జనవరి8: మండల కేంద్రంలో గల కోటయ్య క్యాంప్ గ్రామానికి చెందిన షేక్.నాజర్ వలి(36) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వర్ని ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. మృతుడు గత కొంతకాలంగా తన భార్య, పిల్లలతో గొడవలకు పాల్పడడంతో వారు అతనిని వదిలి దూరంగా ఉంటున్నట్లు ఎస్ఐ తెలిపారు. దీంతో తనతో భార్య, పిల్లలు కలిసి ఉండడం లేదని తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఇనుప రాడ్‌కు చీరను కట్టి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. మృతుడి సోదరుడు షేక్.బాజీ ఫిర్యాదు మేరకు మృతదేహనికి శవ పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

మట్కా స్థావరాలపై కొనసాగుతున్న దాడులు

- మట్కారాయుళ్ల అరెస్టు ● రూ.9860 నగదు స్వాధీనం

ఖిల్లా , జనవరి 8: మట్కా నిర్వాహకులపై దాడులు కొనసాగుతున్నాయి. నగరంలో గత కొన్ని రోజులుగా పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగేనేవార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపి.రాజశేఖరరాజు నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు అజయ్‌కుమార్, అంజయ్యల ఆధ్వర్యంలో దాడులను ముమ్మరం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం మట్కా స్థావరాలపై దాడులు చేసి ప్రధాన నిర్వాహకుని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి మట్కాకు సంబంధించిన వాటిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నగరంలోని మిర్చికంపౌండ్ రైల్వే ట్రాక్ సమీపంలో మట్కా ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 9,860 నగదు స్వాధీనం చేసుకున్నారు.

● ప్రధాన నిర్వాహకుడి కోసం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆరా...

జిల్లాలో మట్కా నిర్వహిస్తున్న ప్రధాన నిర్వహకుల కోసం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆరా తీస్తున్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం అరెస్టు చేసిన అంతర్రాష్ట్ర మట్కా నిర్వాహకుడిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆయన వెంట ఎవరెవరు ఉన్నారో తెలుసుకునే పనిలో ఉన్నారు.

పొతంగల్‌లో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి,జనవరి8: పొతంగల్ మండల కేంద్రంలోని మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.